# హాల్ట్ లేదాయె.. హైరానా మొదలాయె!

- కళ కోల్పోతున్న ఓబులవారిపల్లె జంక్షన్
- రాయలసీమ, హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేత
- అధికారుల తీరుపై మండిపడుతున్న ప్రయాణికులు


ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో గతంలో నిలిచి ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్

ఓబులవారిపల్లె : రైల్వేశాఖ అధికారులు, మంత్రులు ఓబులవారిపల్లె జంక్షన్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. కృష్ణపట్నం రైలు మార్గం దక్షిణ భారతంలోనే రెండవ పెద్ద రైల్వే టన్నెల్ మార్గం కలిగిన ఓబులవారిపల్లె జంక్షన్‌లో ప్రస్తుతం నిలుస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్, హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రెండు రైళ్లు మాత్రమే నిలుస్తున్నాయి. కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్ల మాట దేవుడెరుగు ఉన్న వాటిని కూడా రైల్వేశాఖ అధికారులు తొలగించారు.

**మార్చి 1 నుంచి స్టాపింగ్ ఎత్తివేత**

మార్చి నెల ఒకటవ తేదీ నుండి రాయలసీమ, హరిప్రియ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేసినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం టికెట్‌లు కూడా ఇవ్వడంలేదని, రిజర్వేషన్ గత నెల నుంచి నిలిపివేశామని స్పష్టం చేశారు. కోవిడ్ అనంతరం వెంకట్రాద్రి ఎక్స్‌ప్రెస్, రాయసీమ, హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పలు మార్లు రైల్వేశాఖ అధికారులతో మాట్లాడటంతో రెండు రైళ్లకు స్టాపింగ్ కల్పించారు. మళ్లీ రెండు సంవత్సరాలలో రెండుసార్లు స్టాపింగ్ ఎత్తివేశారు. దీంతో ఓబులవారిపల్లె జంక్షన్‌పై రైల్వే అధికారులు వివక్షచూపడాన్ని స్థానికులు మండిపడుతున్నారు.

**ప్రయాణికుల పాట్లు**

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేయడంతో మండల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ ఉదయం తిరుపతి, చెన్నైకి వెళ్లాలంటే తొలగించిన రైళ్లు ఎంతో అనుకూలంగా ఉండేవి. అలానే తిరుపతి, రేణిగుంట నుంచి చెన్నై, విజయవాడతోపాటు ఇతర ప్రాంతలకు వెళ్లేందుకు లింక్ రైళ్లు ఉండేవి. అంతే కాకుండా ఉపాధ్యాయులు విద్యార్థులు వ్యాపారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్న రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ వల్లే రాయలసీమ, హరిప్రియ రైళ్ల స్టాపింగ్ కల్పించామని గతంలో మరి బ్యానర్‌లు వేయించి హడావిడి చేసిన బీజేపీ నాయకులు ప్రస్తుతం వారి జాడ కనిపించడం లేదు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ముందు నుంచి దక్షిణ మధ్య రైల్వే, రాయలసీమ రైల్వేస్టేషన్‌ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనేది బహిరంగా రహస్యమే. దశాబ్దలుగా చెన్నై, ముంబై, తిరుమల ఎక్స్‌ప్రెస్, నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లకు ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ కల్పించాలని అనేక సార్లు రైల్వేశాఖ అధికారులకు నాయకులు, ప్రజాప్రతినిధులు విన్నవించుకోవడం జరిగింది. అయినా ఒక్క రైలుకు కూడా స్టాపింగ్ కల్పించకపోగా ఉన్న రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేయడం దారుణమని ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

**రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్తాం**



ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌తో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. హరిప్రియ, రాయాలసీమ ఎక్స్‌ప్రెస్‌లు ఓబులవారిపల్లె స్టాపింగ్ ఎత్తివేసిన విషయంపై రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్తాం. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ద్వారా కేంద్ర రైల్వే శాఖ మంత్రికి సమస్యను తెలియజేస్తాం. రైల్వే శాఖ ఈ విషయంపై దృష్టిసారించి శాశ్వత పరిష్కారం చూపాలి.
– తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్, ఓబులవారిపల్లె

**స్టాపింగ్ కల్పించాలి**



ప్రయాగ్ రాజ్ కుంబామేళా పేరుతో పేదల బండి ఇంటర్‌సిటీ ప్యాసింజర్ రైలును తొలగించారు. ఇప్పుడు మళ్లీ రాయలసీమ, హరిప్రియ రైళ్లకు స్టాపింగ్ ఎత్తి వేశారు. మన ప్రాంతంలో రేణిగుంట వదిలితే కడప, యర్రగుంట్ల, గుంతకల్లు నిలబడే ఎంజీఆర్ చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు కర్నాటక రాష్ట్రంలో ప్రతి చిన్న స్టేషన్‌లో కూడా నిలబడుతుంది. అయితే మా ప్రాంతం రైల్వేస్టేషన్‌లపై రైల్వేశాఖ అధికారుల ఎందుకు ఇంత వివక్ష. తొలగించన రైళ్లకు వెంటనే స్టాపింగ్ కల్పించాలి.
– రామకృష్ణయ్య, మాజీ ఎంపీపీ, గాదెల, ఓబులవారిపల్లె

## క్లుప్తంగా

### పార్టీ బలోపేతానికి కృషి చేయండి


రాజ్యసభ సభ్యులు మేడా, తిరుపతి ఎంపీ గురుమూర్తిలను సత్కరిస్తున్న నాయకులు

వీరబల్లి : రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలను వీరబల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా పదవులు పొందిన వారు ఎంపీలను గజమాలతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలని ఎంపీ మేడా నాయకులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని తెలియజేశారు. ఎంపీని కలిసిన వారిలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిగుట్ల అమర్నాథ్ రెడ్డి, వీరబల్లి మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణిరాజు, మాదిరెడ్డి నారాయణ రెడ్డి, ఎర్రపురెడ్డి పురుషోత్తం రెడ్డి, నరేష్ స్వామిలు ఉన్నారు.

### రేకుల షెడ్లు తొలగించాలి


ఆక్రమణలోని రేకుల షెడ్లను పరిశీలిస్తున్న అధికారులు

గాలివీడు : ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను వెంటనే తొలగించకపోతే చర్యలు తప్పవని ఆక్రమణదారులను ఏఈ ధర్మారెడ్డి హెచ్చరించారు. డీఈ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని గుర్రాలమిట్ట వద్ద సర్వే నంబర్ 467,475/5బి, 475/6 ఆక్రమణలో ఉన్న రేకుల షెడ్లను వీఆర్వో అల్లబకాష్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణదారులకు మూడు రోజులు గడువు ఇచ్చామని ఈలోపు రేకుల షెడ్లు తొలగించకపోతే తామే స్వయంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్‌పై నిషేధాన్ని కఠినంగా అమలుచేయండి

రాయచోటి అర్బన్ : జిల్లాలో ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై ఉన్న నిషేధాన్ని కఠినంగా అమలుచేయాలని జనసేన పార్టీ నేత రామ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం ఆయన ఆ పార్టీ నేతలతో కలసి కలెక్టర్‌ను కలుసుకున్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వాడకం ద్వారా ప్రజారోగ్యం దెబ్బతింటోందన్నారు. ప్లాస్టిక్ గ్లాస్, కవర్‌లు, కప్పులు తదితరాల వాడకాన్ని నివారించాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల క్రయ, విక్రయాలను నిషేధించడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు కృషిచేయాలంటూ కోరారు.

### ' నా భూమిని ఆన్‌లైన్ చేయండి'


భూమి ఆన్‌లైన్ కోసం వేచి ఉన్న వృద్ధురాలు

పుల్లంపేట : తన భర్త నుంచి సంక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పుల్లంపేట మండలం, అనంతయ్యగారిపల్లెకు చెందిన టి.లక్షుమ్మ అధికారులను కోరుతోంది. భర్త పుల్లయ్యకు సర్వే నంబర్. 523/1,2లో 45 సెంట్లు భూమి ఉంది. తన వినతిపై జిల్లా కలెక్టర్ స్పందించి ఈ భూమిని ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు ఇచ్చినా స్పందించలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తక్షణం తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బాధితురాలు కోరుతోంది.

### పైపులైన్‌కు మరమ్మతులు

నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నారాయణరాజుపేట గ్రామానికి తాగునీటిని అందించే పైపులైను మరమ్మతులకు గురికావడంతో ఫిట్టర్ సుబ్బయ్య ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు నిర్వహించి పైపులైను పునరుద్ధరించారు. గత రెండు రోజులుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని పంచాయతీ సెక్రటరీ సురేష్ కుమార్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే సిబ్బందిచే మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరాను అందేలా చూశారు.

### పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఒంటిమిట్ట : మండలంలో పండించే పసుపుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు, ఒంటిమిట్ట చెరువు ఆయకట్టు వైస్ చైర్మన్ కట్టా యానాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒంటిమిట్ట డిప్యూటీ తహసీల్దార్ అంజనా గౌరీకి ఆయన వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఒక ఎకరా పసుపు పంట సాగు చేయడానికి ఆరుగాలం శ్రమించి రూ.50 వేలు వరకు ఖర్చు చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరి ఆంధ్రప్రదేశ్‌లో పసుపు రూ.12 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## చెత్తకుప్పలుగా వీధులు


ఇళ్ల మధ్య పేరుకపోయిన చెత్తను చూపుతున్న న్యాయవాది హుమయూన్ బాషా

రాయచోటి టౌన్ : మా వీధులలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు అన్నింటిని చెత్తకుప్పలు (దిబ్బలుగా) మార్చేస్తున్నారని తద్వారా ప్రజలు వ్యాధుల బారీన పడుతున్నారని న్యాయవాది హుమయూన్ బాషా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం 22వ వార్డులోని అనేక వీధులలో ఇళ్ల మధ్య ఖాళీ జాగా కనిపిస్తే చాలా ఇళ్లలో నుంచి చెత్తను తీసుకొచ్చి ఆ ప్రదేశాలలో వేస్తున్నారని చెప్పారు. ఇలా వేయడం వలన చెత్త కుళ్లి దోమలకు నిలయంగా మారడంతో ప్రజలు వ్యాధుల బారీన పడుతున్నారని తెలిపారు. దీనిపై మున్సిపల్ అధికారులు ఇలా ఎక్కడ పడితే అక్కడ చెత్తను పడవేయనీకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సంబేపల్లె : మండల పరిధిలోని యర్రగుంట్ల సోషల్ వెల్ఫేర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో 266 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి వుండగా ముగ్గరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద సంబేపల్లె పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

## 'అసత్య ఆరోపణలు మానుకోండి'

**ఆకేపాటిపై టీడీపీ నేత వ్యాఖ్యలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందలూరు : రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ రెడ్డిని విమర్శించే స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు తేల్చి చెప్పారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి నాయకులు పాలన చేయడం చేతకాక ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నాయకులపై విమర్శలకు దిగుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి హవాను తట్టుకొని ఆకేపాటి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. రాజంపేట ప్రజలకు ఆయన కుటుంబం చేసిన సేవలే ఆయన్ను ఎమ్మెల్యేను చేశాయని చెప్పారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆకేపాటిపై మేడా విజయశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలను వారు ఖండించారు. తాను ఏ అక్రమణలు చేయలేదని ప్రభుత్వం సర్వే చేసి ఆక్రమణలు ఉంటే వెనక్కి తీసుకోవచ్చని తెలియజేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అంతేగాని ఇలా అసత్య ఆరోపణలు చేయడం ఆపాలని తెలుగుదేశం నాయకులకు హితవు పలికారు. స్వయంగా పార్టీ ఇన్‌చార్జే తన ఓటమికి విజయశేఖర్ రెడ్డి కారణమని బాహాటంగా చెప్పారని, అటువంటి వ్యక్తి మా నాయకుడిపై చేసే విమర్శలకు తాము బెదరబోమని, ఆకేపాటి కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి, జడ్పీటీసీ గడికోట వెంకట సుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, గొబ్బిళ్ల త్రినాథ్ యాదవ్, నడివీధి సుధాకర్, గుండు మల్లికార్జున, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, ఇబ్బు, రవిరాజు, ఆనాల మధు యాదవ్, మోడపోతుల సుధాకర్, మధురాజు, కామాక్షి, నవాబ్, రాజశేఖర్ రెడ్డి, శంకర్, మహబూబ్ బాషా, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిర్దిష్ట కార్యాచరణ ప్రకారం టీకాలు


టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మాలకొండయ్య

చిన్నమండెం : నిర్దిష్ట కార్యాచరణ ప్రకారం పాడి జీవాలకు గాలికుంటు నివారణ టీకాలను వేయాలని పశుసంవర్ధక శాఖ రాయచోటి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య సిబ్బందికి సూచించారు.. సోమవారం మండల పరిధిలోని దిగువగొట్టివీడు, బోనమల గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. మండలంలో 240 గాలికుంటు టీకాలు ఉచితంగా వేసినట్లు తెలిపారు. అదే విధంగా బ్రూసెల్లా వ్యాధికి సంబంధించి 4 నెలల నుంచి 8 నెలల లోపల ఉన్న 40 దూడలకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా.గణేష్, పశువైద్య శాఖ సిబ్బంది, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

గాలివీడు : అధికారుల విధులకు విఘాతం కలిగించేలా పదేపదే తప్పుడు అర్జీలను సమర్పించి బెదిరింపులకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో భాగంగా ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గోరాన్ చెరువు గ్రామం కుమ్మరపల్లెకు చెందిన అనిమేల నాగరాజు, అనిమేల పార్వతమ్మలు తమ భూ సమస్యను పరిష్కరించాలంటూ గతంలో ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకోగా రెవెన్యూ అధికారులు, సర్వేయర్ వెళ్లి సమస్యను పరిష్కరించారన్నారు. అయితే ఫిర్యాదుదారుడు మాత్రం పరిష్కరించబడిన అంశంపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించేలా పదేపదే బెదిరింపు ధోరణితో కక్షపూరితంగా 213 ఫిర్యాదులు నమోదు చేశాడన్నారు. అలానే రెవెన్యూ సిబ్బంది తనపై దాడి చేశారని, పాస్ బుక్‌లు ఇవ్వలేదని, తనపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ సిబ్బందిపై ఫిర్యాదు చేయడాన్ని తప్పుబట్టారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించేలా తప్పుడు సమాచారంతో ఫిర్యాదులను పునరావృతం చేస్తున్నారన్నారు. తప్పుడు సమాచారంతో ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ బాలాజీ, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ స్థానం గెలుపుపై సంబరాలు


మిఠాయిలు పంచుకొంటున్న ఆపస్ నాయకులు

రాయచోటి టౌన్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో డాక్టర్ గాదె శ్రీనివాస నాయుడు గెలుపుపై ఆపస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఆపస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు. వెలువడిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఏపీయూఎస్ (ఆపస్) బలపరిచిన అభ్యర్థిగా గాదె శ్రీనివాస నాయుడు గెలిచినట్లుగా తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలు అయినా ఉమ్మడి కామన్ సర్వీస్ రూల్స్‌ను త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు ఈ గెలుపు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం గెలుపొందిన ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, జీవీ రమణ, శ్రీనివాసులు, వై.నాగేంద్ర బాబు, నాగేంద్ర ప్రసాద్, కె.నాగరాజు, బి.రాజేంద్ర, బి.చలపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు


నైనాదీశ్వరుడిని తమలపాకులతో అలంకరించిన దృశ్యం

పెనగలూరు : మండల కేంద్రంలోని నైనాదీశ్వర స్వామి ఆలయంలో పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను తమలపాకులతో అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ కామాక్షిదేవి

## మహిళా ఉద్యోగులకు సన్మానం

ఒంటిమిట్ట : ప్రపంచ మహిళా దినోత్సవంలో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రంలో వారోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఒంటిమిట్ట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో సచివాలయ మహిళా ఉద్యోగులను సన్మానించారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన కల్పించి ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు.

## భుజంగేశ్వరుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## 'మిలాన్'లో రాణించిన విద్యార్థులు

రాజంపేట రూరల్ : గుంటూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మిలాన్ ఉత్సవ్‌లో అన్నమాచార్య ఫార్మసీ విద్యార్థులు రాణించినట్లు కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలియజేశారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీలో సోమవారం రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారథులు డి.అక్బర్‌వలీ, టి.వినోద్‌కుమార్, వై.సాయిమేఘనాథ్‌రెడ్డి, డి.గణేష్, ఎస్.హస్నైన్, ఎం.మహేష్‌బాబు, జి.వెంకటపవన్, డి.తరుణ్ బృందం కబడ్డీ పోటీలలో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలియజేశారు. అదే విధంగా 3వ సంవత్సరం ఫార్మా డీ విద్యార్థి డి.గణేష్ రెండవ బహుమతి సాధించినట్లు తెలియజేశారు. ఈ అభినందన సభలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎం.మధు, అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.హేంజాబేగ్‌లు పాల్గొని అభినందించారు.

## మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

రాయచోటి అర్బన్ : ఆప్కాస్ ద్వారా ఎంపికై విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ కార్మికులందరిని వెంటనే క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, ఏపీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. శ్రీనివాసులు, వి.సురేష్ కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం జీఓ నంబర్ 2 ద్వారా ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటీఎస్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఆప్కాస్‌ను రద్దుచేస్తే కార్మికుల జీతాల చెల్లింపు, పనుల అప్పగింత కార్యక్రమాలను మున్సిపల్ శాఖ అధికారులకే అప్పజెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేశవరావు, నాగరాజు, పృథ్వీరాజ్ తిరుమల, దేవ, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుండుపల్లిలో నగదు చోరీ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

సుండుపల్లె : సుండుపల్లి నుంచి తమ గ్రామానికి గంగిరెడ్డి గారి పల్లి (కుంటల ముందర) కు వెళ్తుండగా గుర్రప్ప చెరువు వద్ద ముగ్గురు వ్యక్తులు అడ్డగించి తన వద్ద నుండి రూ.10 లక్షలను దొంగలించారని బాధితుడు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీసులకు సమాచారం తెలుపగా ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితున్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

## సమష్టి కృషితోనే మున్సిపాలిటీ అభివృద్ధి

**రాజ్యసభ ఎంపీ మేడా, ఎమ్మెల్యే ఆకేపాటి**


రాజ్యసభ సభ్యుడు మేడాకు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి

రాజంపేట టౌన్ : మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమష్టిగా పనిచేసి రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి నేతృత్వంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మేడా, ఆకేపాటి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చే సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరించకుంటే కౌన్సిలర్లు వారి వార్డుల్లోని ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితులు ఉంటాయన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి కౌన్సిలర్లు ప్రజల విశ్వాసాన్ని కూడా కోల్పోతారన్నారు. అధికారులు, కౌన్సిలర్లు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. వార్డుల్లో చేపట్టే ఎలాంటి పనిఅయినా కౌన్సిలర్లకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని పార్టీలతో కలిపి తొమ్మిది మందితో కౌన్సిల్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులతోపాటు సమస్యల పరిష్కరించే బాధ్యత కూడా కౌన్సిల్ కమిటీనే తీసుకుంటుందని అన్నారు. ఇందువల్ల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కాగలవని తెలియజేశారు. ఇదిలావుంటే మార్కెట్ అభివృద్ధికి ఎంపీ ఫండ్స్ కింద నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు మేడా సానుకూలంగా స్పందించి రూ.25 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్‌లో చేపట్టే అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని మేడా అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గత కమిషనర్ నాగేశ్వరరావు తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం**

రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ సస్పెండ్ అయిన నాగేశ్వరరావు పాలకవర్గం అనుమతి లేకుండానే ఐదుమంది సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిపై నియమించుకోవడం పట్ల పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకవర్గం దృష్టికి తీసుకురాకుండానే మరో ఆరుమందిని నియమించుకునేందుకు కలెక్టర్ అనుమతి కోరి ఉన్నారని ఇకపై ఇలా వ్యవహరిస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. రూ.50 వేలలోపు అయ్యే పనులకు పాలకవర్గం అనుమతిలేకుండా ఖర్చు చేయవచ్చన్న నిబంధనను గత కమిషనర్ నాగేశ్వరరావు దుర్వినియోగం చేశాడని సభ్యులు ఆరోపించారు.

## రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఒంటిమిట్ట : ఎన్నికల ముందు కూటమి నేతలు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు అందజేయాలన్నారు. పండించిన పంటలకు మద్దతు ధరలు అమలు చేసి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. ఒంటిమిట్ట చెరువుకు సోమశిల ఎత్తిపోతల పథకం ద్వారా శాశ్వతంగా నీరు అందించి చెరువు కింద ఉన్న ఆయకట్టు భూములకు సాగు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. ఒంటిమిట్ట గ్రామ సర్వే నెంబరు. 2050లో ఒంటిమిట్ట, మృకుండ ఆశ్రమం, కొత్తమాధవరం, మల్లేశ్వరపురం గ్రామాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. రూ. 2 లక్షల వరకు రైతులకు సంబంధించిన బ్యాంకులో రుణాలు భర్తీ చేయాలని కోరారు.

## వన్యప్రాణుల సంరక్షణకు తోడ్పడాలి

సిద్దవటం : వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం సిద్దవటం రేంజిలోని సిద్దవటం బీటు కపర్థీశ్వరుని కోన అటవీ ప్రాంతంలో సిద్దవటానికి చెందిన శ్రీ నలంద హైస్కూల్ విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ వన్యప్రాణులకు భూమి మీద స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, వాటికి హాని కలిగించకుండా ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. వన్యప్రాణులకు ముప్పు వాటిల్లే కార్యక్రమాలను చేయకూడదని సూచించారు. గ్రామాల్లో వన్యప్రాణులు కనబడితే అటవీ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. హాని చేయడకూడదన్నారు. లంకమల అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ అటవీ ప్రాంతం పచ్చదనంగా ఉండేలా చూడాలని విద్యార్థులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంటు వెంకటసుబ్బయ్య, విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 12న ఉపాధి సమస్యలపై మహాధర్నా


మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్వేలి : జాతీయ ఉపాధిహామీ పథకం సమస్యలపై ఈనెల 12వ తేదీన విజయవాడలో ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి పిలుపునిచ్చారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కార్యకర్తలతో కలిసి మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరోజుల ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పనిదినాలు కల్పించాలని కోరారు. సమ్మర్ అలవెన్సులు, పే స్లిప్‌లు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, వలస కార్మికులకు ఉచితంగా రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్ బండ అందించాలన్నారు. ప్రమాదాలలో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు నగదు, ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల ప్రభుత్వ భూమి, మూడు సెంట్లు ఇంటిస్థలం, ప్రతి దళిత కాలనీలలో రెండు ఎకరాల స్మశానస్థలం, ఉపాధి హామీ మేట్లకు పారితోషకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివయ్య, శివనందు, ఆనందయ్య, బుర్హాన్, శంకరమ్మ, నారాయణమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్టు

ఒంటిమిట్ట : కొత్తపల్లె గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరాలపై పోలీసులు దాడిచేసి సోమవారం నలుగురు జూదరులను అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు మండలంలోని కొత్తపల్లె గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ శివప్రసాద్ సిబ్బందితో వెళ్లి దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని అక్కడ వారి వద్ద నుంచి రూ. 12వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.